# అమ్మమ్మ.కామ్

*కథ, స్క్రీన్‌ప్లే: పాలగుమ్మి సీత* *సంభాషణలు: వసుంధర*

**ఎపిసోడ్ 1:**

Scene No. 1

నడివయస్కురాలైన ముత్తైదువ పవిత్ర హస్తం. సంప్రదాయబద్ధంగా ఆ చేతి నిండుగా గాజులు. చేయి కదిలితే మనోహరంగా గాజుల గలగల. ఆ శబ్దం ఆగగానే గోరింటాకు పండిన చూపుడు వేలి స్పర్శకు 'క్లిక్' మన్న కంప్యూటర్ మౌస్. ఆ వెంటనే కంప్యూటర్ మానిటర్లో దివ్యతేజం. ఆ తేజంనుంచి ఆవిర్భవించిన 'దుగ్గిరాల కుటుంబం' అన్న శీర్షిక. ఆ శీర్షికకింద వరుసగా కుటుంబసభ్యుల పేర్లు. బాణంగుర్తు వాటిమీద కదులుతూ 'వెంకట్రావు' పేరుమీద ఆగింది. ఆ పేరు జూమ్ అయి పెద్దదౌతుంది. ఆ పేరులోంచీ ఓ ఇంటి తలుపు. బాణంగుర్తు మీదకు రాగానే అది తెరుచుకుంది. కెమేరా ముందు ఓ పేపరు. దానిమీద 'మా తెలుగు తల్లికి మళ్ళీ పూదండ- జస్ట్ యెల్లో కొత్త సీరియల్' అన్న పెద్ద శీర్షిక. ఆ పేపరు

అడ్డంతీస్తే- గంభీరమైన వెంకట్రావు ముఖం.

వెంకట్రావు: టీవీల్లో పెళ్ళిని పెల్లి అంటే ఏదోలా ఉన్నా- పేపర్లో మల్లిని మళ్ళీ అంటే ఎంతో బాగుంది-

అంటూ ఆ వార్తను కత్తిరించాడు. ఆ పక్కన వరుసగా మూడు బోర్డులున్నాయి. మొదటి బోర్డుమీద 'మాయింటి ముచ్చట్లు' అన్న శీర్షిక. దానికింద 'మంచిని పెంచుకో. మంచి మాట పంచుకో' అన్న సూక్తి. ఆ సూక్తి కింద పేపర్ కటింగ్ పిన్ చేసాడు.

రెండోబోర్డుమీద, 'మనమూ- మన దినచర్య' అన్న శీర్షిక. దానికింద 'శక్తినిచ్చే సూర్యుడు రోజూ ఉదయిస్తాడు. ఆయన మార్పుకోరితే భూమికి ప్రళయమే' అన్న సూక్తి. దానికింద 'దినచర్యలో మార్పు లేకుండా' అన్న సబ్‌హెడింగ్ కింద 117వ రోజు అని వ్రాసుంటే 7ను చెరిపి 8 చేస్తాడు.

మూడోబోర్డుమీద, 'విన్నపాలు వినవలె' అన్న శీర్షిక. దానికింద 'అడగందే అమ్మైనా పెట్టదు. అడిగారని నాన్నా ఇవ్వరు' అన్న సూక్తి. దానికింద 'బస్ పాస్‌కి 350' అని వ్రాసుంటే 3 చెరిపి 1 వేసి- బస్ చెరిపి రూట్‌గా మార్చి-

వెంకట్రావు: కాంతం- ఓ సారిలా వచ్చి కనపడు

Scene No. 2

గాజుల గలగల. మౌస్ క్లిక్. లక్ష్మీకాంతమ్మ పేరు జూమ్ అయి పెద్దదౌతుంది. ఆ పేరులోంచీ గాజులచేయి. మళ్ళీ గాజుల గలగల. ఆ శబ్దానికి జతగా అట్లకాడను బూరెలమూకుడులో కదుపుతున్న శబ్దం. ఆ నేపథ్యంలోంచీ ఓ గొంతు.

లక్ష్మీకాంతమ్మ: ఆ( పనిమధ్యలో ఉన్నాను. కాసేపాగండి. కనిపిస్తాను.

Scene No. 3

గాజుల గలగల. మౌస్ క్లిక్. రవికాంత్ పేరు జూమ్. ఆ పేరులోంచీ తనలో తను మాట్లాడుకుంటూ రవికాంత్.

రవికాంత్: నేను అమెరికా వెడుతున్నాన్రా. అది నిజం. నేను మన తెలుగమ్మాయినే పెళ్ళి చేసుకుంటాన్రా. అదీ నిజం. ఎవరా అమ్మాయంటావా?

అటూ ఇటూ చూసి — అమ్మో- గోడకు చెవులుంటాయి. గోడవతల నాన్నుంటారు. ఇప్పుడు చెప్పను కాక చెప్పను.

అంటూంటే కెమేరా ఫోకస్ మారి అతడు సెల్‌ఫోన్లో మిత్రుడితో మాట్లాడుతున్నట్లు

తెలుస్తుంది.

Scene No. 4

గాజుల గలగల. మౌస్ క్లిక్. శశికాంత్ పేరు జూమ్. ఆ పేరులోంచీ తలుపులు మూసి ఉన్న ఓ బెడ్రూం. అక్కడ భావకవి వేషంలో కూర్చుని సాలోచనగా వ్రాసుకుంటున్న శశికాంత్.

శశికాంత్: 'నీవు కాక వేరెవరైనా నవ్వలేరు వెన్నెలలాగా'- ఆహా ఎంత గొప్పగా చెప్పాను! ఇంత గొప్ప కవిత వ్రాసినవాణ్ణి ఒక్కసారి కళ్ళారా చూడాలి-

అంటూ అద్దం ముందుకు వెళ్ళి- హలో బ్రదర్

అంటూ ప్రతిబింబాన్ని పలకరిస్తాడు.

ప్రతిబింబం: బొత్తిగా ఒరిజినాలిటీ లేదు. పలకరింపుక్కూడా సినిమా టైటిల్ కాపీ-

అని విసుక్కుంటుంది.

శశికాంత్: (పట్టించుకోకుండా) ఓకే- నా పిలుపు నీకు నచ్చలేదు- మరి నా కవిత?

ప్రతిబింబం: నీవుకాక వేరెవరైనా వ్రాయలేరు శ్రీశ్రీ లాగా?

శశికాంత్: అబ్బ- ఇదే మాట క్రిష్ కూడా అంటే- ఓహ్-

అంటూ మెలికలు తిరుగుతాడు

ప్రతిబింబం: క్రిష్ ఎవరు?

శశికాంత్ చెప్పాలని నోరు తెరిస్తే తలుపు తట్టిన చప్పుడు.

శశికాంత్: క్రిష్ గురించి ఇప్పుడు కాదు. కాసేపాగేక చెప్తాను

అంటూ చకచకా వేషంమార్చి తలుపు తీస్తాడు.

Scene No. 5

గాజుల గలగల. మౌస్ క్లిక్. ప్రమోద పేరు జూమ్. ఆ పేరులోంచీ అందమైన ఓ టీనేజ్ అమ్మాయి ప్రమోద. ఆమె విన్నపాల బోర్డుమీద 150ని 650 చేసి-

ప్రమోద: అమ్మా! ఈ నెలనుంచి నా మూడు ఆరయిందేవ్- ఆహా- నాన్నగారి చేతికి ఎముకేలేదు.

అంటూండగా వెనకాల అలికిడి. అటు చూస్తే-

వెంకట్రావు: నాకు చేతికెముకలేదు కానీ చేతిలో డస్టరుంది-

అంటూ అంకె మొత్తం చెరిపేస్తాడు.

నాకు చేతికెముకలేదు కానీ చేతిలో డస్టరుంది-

Scene No. 6

గాజుల గలగల. మౌస్ 'క్లిక్'. ఆ వెంటనే కంప్యూటర్ మానిటర్లో దివ్యతేజం. ఆ తేజంనుంచి ఆవిర్భవించిన 'ముళ్ళపూడి కుటుంబం' అన్న శీర్షిక. బాణంగుర్తు పూజ పేరును క్లిక్ చేస్తే ఆ ఇంటి గేట్లోంచీ బాణంలా దూసుకొచ్చిన స్కూటీ, దానిపై హెల్మెట్ ధరించిన పూజ. కాస్త దూరమెళ్ళగానే ఢాం అన్న శబ్దంతో టైరు పంక్చర్. పూజ బ్రేకువేసి హెల్మెట్‌తీసి బండిని రోడ్డుపక్క పార్క్‌చేసి- సెల్ తీసి-

పూజ: హలో! మేనేజర్-

అంటుంది. మరుక్షణం ఆమె పక్కన రెండు బైక్సు ఆగాయి. ఒకదానిపై మేనేజర్. మరోదానిపై ఉన్న అపరిచిత యువకుడు: లిఫ్ట్?

అన్నాడు.

పూజ: థాంక్యూ- మీరెటు వెడుతున్నారు?

అనడిగి- అతడు చెప్పేలోగా ఓకే- దట్ సూట్స్ మీ-

అంటే యువకుడు తెల్లబోయి చూస్తాడు. ఈలోగా

మేనేజర్:

అపరిచితుణ్ణి ఉరుముతూ చూసి నేనొచ్చేసాను మేడమ్!

అంటూ ఆమెవంక అతి వినయంగా

చూసాడు.

పూజ: అన్నట్టు- మీరు డ్రైవింగులో ఎక్స్‌పర్ట్ కదూ! ఒకేసారి రెండు బైక్సు నడిపారని గుర్తు.

మేనేజర్ ఛాతీ ఉబ్బింది. ఔనన్నట్టు తలూపి అపరిచితుణ్ణి నిర్లక్ష్యంగా చూసి తన బైక్ వెనకాల సీటుని రుమాలుతో తుడిచాడు. పూజ ఆ సీటుమీద స్కూటీ తాళముంచి-

పూజ: మరి- స్కూటీ వెనక్కి, బ్యూటీ ముందుకి!

అని అపరిచితుడి బైక్ వెనుక కూర్చుని ఎటు వెళ్ళాలో దారి చూపిస్తుంది. మేనేజర్ ముఖం పాలిపోతుంది-

మేనేజర్: ఏదోరోజున నీతో మారేజ్ మానేజ్ చేస్తాను. పెళ్ళయ్యాక నన్నిలా మానేజ్ చెయ్యడం నీవల్ల కాదు. నేను సామాన్యుణ్ణి కాదు.

కెమేరా బైకుమీద ఫోకస్. అపరిచితుడు మూడుసార్లు సడెన్‌బ్రేకులేసాడు. మూడోసారి పూజ అతడి తలమీద గట్టిగా మొట్టి,

పూజ: స్టాప్

బైక్ ఆగింది

నాటీ వెనక్కి బ్యూటీ ముందుకి- ఓకే

అపరిచితుడు: నాటీ నేను కాదు- మన రోడ్లూ, ట్రాఫిక్కూ! ముందుంటే మీరూ నాకులాగే సడెన్‌బ్రేకులేయక తప్పదు.

పూజ: వేస్తే వేస్తాను కానీ మీకులా కాదు. నేను బ్రేకేస్తే మీరు బండిమీంచి ఔట్-

అపరిచితుడు తెల్లబోయాడు. ఒక్క కుదుపుతో బైక్ స్టార్టైంది.

Scene No. 7

గాజుల గలగల. మౌస్ 'క్లిక్'. బాణంగుర్తు వేణుగోపాల్ పేరును క్లిక్ చేస్తే- భార్యపటం ముందు వేణుగోపాల్. ఆయన తన చేతిలోని గులాబిని పటంముందుంచి-

వేణుగోపాల్: అమ్మాయి వయసులో ఉంది. నువ్వు నా మనసులో ఉన్నావు. మీరిద్దరూ ఎటు నడిపిస్తే అటే నా నడక-

అప్పుడు పటంలోంచీ-

మరి మీరా?

అని వినిపిస్తుంది. వేణుగోపాల్ ఊహలో మీరా- తన ఒడిలోని పూజ తల ఆప్యాయంగా నిమురుతూ. ఆయన ముచ్చటగా నవ్వి పటాన్ని చూసి-

వేణుగోపాల్: మీరా- పూజకు ఆంటీ. ఐతే నాకేంటీ?

అంటూ పాత పువ్వును తీసి బయటకొచ్చి

చెత్తకుండీలో వేయబోతూండగా స్కూటీ పార్కు చేస్తున్న మేనేజరు కనిపిస్తాడు.

వేణుగోపాల్: బండిక్కడే ఉంది- అమ్మాయేదీ?

మేనేజరు ముఖంలో ఉక్రోషం.

మేనేజరు: దార్లో టైరు పంక్చరైతే...

అంటూ జరిగింది పితూరీలా చెప్పబోతాడు.

వేణుగోపాల్: టైరు పంక్చరా? ఐతే రిపేరు సంగతి చూడు-

అని లోపలకు వెడతాడు.

Scene No. 8

గాజుల గలగల. మౌస్ 'క్లిక్'. ఆ వెంటనే కంప్యూటర్ మానిటర్లో దివ్యతేజం. ఆ తేజంనుంచి ఆవిర్భవించిన 'పప్పు కుటుంబం' అన్న శీర్షిక. బాణంగుర్తు వెంకటలక్ష్మి (లక్కీ) పేరును క్లిక్ చేస్తే 'స్టాట్యూ ఆఫ్ లిబర్టీ'. దాన్నే తదేకంగా చూస్తున్న వెంకటలక్ష్మి.

వెంకటలక్ష్మి: ఈ జీవితానికి అమెరికా వెళ్ళేదెప్పుడో, ఆ కాగడామీద టీ కాచుకునేదెప్పుడో?

అని నిట్టూర్చితే లోపల్నుంచి- అదే కాగడాపెట్టి కొడితే కాగడాపెట్టి వెదికినా కన్పించకుండా పోతావ్. ఆత్మారాముడు గోల చేస్తున్నాడే వెంకటలక్ష్మీ! ముందు టిఫిన్ సంగతి

చూడు.....

ఆ పిలుపే నాకు నచ్చదు. నన్ను లక్కీ

వెంకటలక్ష్మి: అనమని ఎన్నిసార్లు చెప్పాలీ?

Scene No. 9

గాజుల గలగల. మౌస్ 'క్లిక్'. బాణంగుర్తు జానకిరామయ్య పేరును క్లిక్ చేస్తే- బ్రెడ్‌స్లైసుల మధ్య ఆవకాయ రాసి, టమేటాలు పిండి సూప్ చేసి- టేబులుమీద పెట్టి-

వెంకటలక్ష్మి: జాకీ! టిఫిను రెడీ-

జానకిరామయ్య: దీని అమెరికా పిచ్చి మండిపోనూ- ఏమండీకి బదులు జాకీ అంటుంది. అదీ- తనే నామీద సవారీ చేస్తూ

అని గొణుక్కుని

టిఫినేమిటి లక్కీ!

వెంకటలక్ష్మి: శాండూవిచ్చీ, సూపూ-

జానకిరామయ్య: పేరుతోనే ఆకల్ని చంపేసింది. అందుకేనేమో ఇంగ్లీషువాడు కూడా దానికి విచ్ అని పేరెట్టాడు

గొణుక్కుంటాడు

Scene No. 10

గాజుల గలగల. మౌస్ 'క్లిక్'. బాణంగుర్తు కృష్ణవేణి (క్రిష్) పేరును క్లిక్ చేస్తే- అద్దంముందు- లంగా, జాకెట్, వోణీలో

తన్ను తాను చూసుకుని మురిసిపోతున్న కృష్ణవేణి. లోపల్నుంచి-

క్రిష్ డియర్! శాండూవిచ్చ్, సూపూ- రెడీ- కాలేజీకి టైమౌతోంది- త్వరగారా!

అన్న పిలుపు.

కృష్ణవేణి: శాండ్‌విచ్ అనడం రాలేదు కానీ నన్ను మాత్రం క్రిష్ అని చక్కగా అంటుంది.

అనుకుంటూ క్షణాలమీద జీన్సులోకి మారి అనుకుని

ఈ డ్రెస్సైతే అమ్మతో నో ప్రోబ్లమ్ వస్తున్నా అమ్... మమ్మీ

అని విప్పిన బట్టల్ని బీరువా అర అడుక్కి దాచేసింది.

Scene No. 11

గాజుల గలగల. మౌస్ 'క్లిక్'. బాణంగుర్తు లీలాకృష్ణ పేరును క్లిక్ చేస్తే- పదేళ్ళ లీలాకృష్ణ క్రాస్‌వర్డ్ పజిల్ ముందున్నాడు.

లీలాకృష్ణ: చిన్నవాణ్ణి. ప్రేమంటేనే తెలియదు. ప్రేమకు పర్యాయపదమేం తెలుస్తుందీ- పెద్దాళ్ళనడగాలి-

అనుకుంటూ లేచాడు. వరుసగా తల్లి, తండ్రి, అక్క పెదవి విరిస్తే-

లీలాకృష్ణ: ఈ ఇంట్లో పెద్దాళ్ళకూ తెలియదు ప్రేమంటే! పక్కింట్లో ట్రైచేస్తే బెటర్.

Scene No. 12

లీలాకృష్ణ వెంకట్రావింటికెళ్ళి ముందు

రవికాంత్‌నడిగాడు. అతడు పూజకు ఫోన్‌చేసాడు. పూజ మీరా ఆంటీకి ఫోన్ చేస్తే-

మీరా: అడిగింది నిన్నుకదా- ప్రేమంటే పూజ అని చెప్పు.

అంది. పూజ రవికాంత్‌కి చెబితే అతడది లీలాకృష్ణకి చెప్పలేక నీళ్ళు నమిలాడు. లీలాకృష్ణ శశికాంత్ దగ్గరకెడితే-

శశికాంత్: నీకు చెప్పకూడదు.

అని తప్పించుకున్నాడు. లీలాకృష్ణ ప్రమోదనడిగాడు-

ప్రమోద: నాకు తెలిసినట్లు ఒప్పుకోకూడదు.

అని తనూ తప్పించుకుంది. లీలాకృష్ణ వెంకట్రావునడిగితే ఆయన- డిస్‌ప్లే బోర్డులో అతికించడానికి కటింగు దొరుకుతుందేమోనని పత్రికలు తిరగేయ సాగాడు. చివరి ప్రయత్నంగా లీలాకృష్ణ వంటింటి ముందుకెళ్ళి-

లీలాకృష్ణ: ఆంటీ! ప్రేమకు పర్యాయపదం మీకు తెలుసా?

అనేసి అలవాటుగా వెనక్కు తిరగబోయాడు. అప్పుడు

ఆగరా

అంటూ ఓ మధురస్వరం.

నువ్వడిగిన ప్రశ్నకు జవాబు- వండి

వడ్డించేవాళ్ళకే తెలుస్తుంది. వండేది ప్రేమతో. వడ్డించేది ఆప్యాయతతో. అందుకని ప్రేమ, ఆప్యాయత-పర్యాయపదాలు

అన్న మాటల వెనుకనుంచీ ఓ స్త్రీమూర్తి ప్రత్యక్షం. ఆమె ముఖంలో ప్రేమచిందే చిరునవ్వు. చేతిలో ఆప్యాయత స్ఫురించే వడ్డన గరిట. కెమేరా చేతి గాజులమీదకు మళ్ళితే-

గాజుల గలగల. మౌస్ 'క్లిక్'. 'రేపు మళ్ళీ కలుద్దాం' అన్న వాక్యం మానిటరుపై కనపడుతుంది.